
## త్వరలోనే 235 వాహనాలకు వేలం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న 235 ద్వి, త్రి చక్ర వాహనాలకు ఆరు నెలల్లో వేలం వేయనున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన యజమానులు సంబంధిత పత్రాలతో అంబర్‌పేట్‌లోని కార్ (సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్స్) హెడ్‌క్వార్టర్స్‌లో సంప్రదించాలని సూచించారు. వాహనాల వివరాలు www.rachakondapolice.telangana.gov.in (సిటిజన్ సర్వీసెస్ అంబాడెడ్ వాహనాలు-2024) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ఇతర వివరాలకు 87126 62661, 80083 38535 సంప్రదించవచ్చని సూచించారు.

## కోర్టు తీర్పుపైనే ఉస్మానియా దవాఖాన భవిష్యత్తు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : ఉస్మానియా దవాఖాన నిర్మాణం కోర్టు తీర్పుపైనే ఆధారపడి ఉన్నదని వైద్యాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఉస్మానియా నిర్మాణ అంశంపై శుక్రవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యాధికారులతో కలిసి సమీక్షించారు. దవాఖానకు సంబంధించిన హెరిటేజ్ అంశంపై కోర్టులో ఉన్న కేసుల స్థితిగతులను ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్‌ను మంత్రి అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో రోగులకు అందుతున్న సేవలు, స్థలాభావం వల్ల ఎదురవుతున్న సమస్యలు, ప్రత్యామ్నాయ చర్యలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

# బడ్జెట్‌పైనే బల్దియా ఆశలు

ప్రగతి ప్రస్థానం ఆగొద్దంటే.. నిధుల వరద కురిపించాల్సిందే

- గడిచిన రెండు నెలలుగా అభివృద్ధి పనుల్లో కనిపించని జోష్
- బల్దియా రూ.3500కోట్లు, జలమండలి రూ.4వేల కోట్లతో ప్రతిపాదనలు
- సీఎం నిర్ణయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రేటర్ వాసులు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రగతికి హైదరాబాద్ మహానగరం గుండెలాంటిది. కేసీఆర్ ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, మెట్రోలతో పాటు ఐకానిక్ కట్టడాలు, అభివృద్ధి, సంక్షేమంలో హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చింది. మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన నగరంగా వరుసగా ఐదుసార్లు దక్కించుకున్నది. ఇటువంటి మహానగరంలో ప్రగతి ప్రస్థానం ఆగకూడదంటే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో పట్టం కట్టాలి. ప్రస్తుత ప్రాజెక్టులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ, వైద్య ఆరోగ్య శాఖలు సమర్పించిన బడ్జెట్ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి సర్కారు నిధుల వరద కురిపించాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో 2024-25 ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహానగరంపై కరుణ చూపుతుందా? గ్రేటర్‌కు నిధులు కేటాయిస్తుందా? అన్నది గ్రేటర్ ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. ఇప్పటికే బల్దియా రూ.3500కోట్లు, జలమండలి రూ.4వేల కోట్లతో సర్కారు ముందు ప్రతిపాదనలు సమర్పించింది. ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్న ఈ ఇరు శాఖలు ఈ బడ్జెట్‌పై భారీగా ఆశలు పెట్టుకున్నాయి.

### జీహెచ్ఎంసీని ఆదుకునేనా?

జీహెచ్ఎంసీ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ప్రస్తుతం రూ.6,530 కోట్లు కాగా.. ఇందులో ఇప్పటికే రూ.6,314 కోట్లు ఖర్చు చేశారు. మున్సిపల్ బాండ్లు, రూపీ టర్మ్ రూపంలో పలు దఫాలుగా తీసుకున్న మెజార్టీ రుణానికి ప్రస్తుతం వడ్డీ మాత్రమే చెల్లిస్తుండగా.. ఏప్రిల్ నుంచి అసలు, వడ్డీ కలిపి వాయిదాలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం సగటున నెలకు రూ.68 కోట్లు చెల్లిస్తుండగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.105కోట్లకు చేరనున్నది. మూడు రోజుల క్రితం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది. వాస్తవంగా బల్దియా ఇప్పటికే ప్రతి నెల వేతనాలు, పింఛన్లకు రూ.130కోట్లు, చెత్త తరలింపు, నిర్వహణకు సంబంధించి టిప్పింగ్ ఫీ కింద సుమారు రూ.40కోట్లు, వీధి దీపాల నిర్వహణ రూ.7కోట్లు, రోడ్ల నిర్మాణం, నిర్వహణ, ఇతర పనులకు రూ.100కోట్లు ఖర్చు చేస్తున్నది. ఆదాయానికి, ఖర్చుకు దాదాపు ఏటా 900కోట్ల మేర లోటు బడ్జెట్ ఉంటుంది. ముఖ్యంగా రూ.1000కోట్ల మేర పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఈ పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు అభివృద్ధి పనులు చేపట్టబోమని ఇప్పటికే జీహెచ్ఎంసీకి కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేసి రోజుకో రీతిలో నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే రెండో దశ ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పనులకు, మూసీ సుందరీకరణకు దాదాపు రూ.3500కోట్ల నిధులు అవసరమని జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదన సమర్పించింది. ప్రభుత్వం ఏ మేర జీహెచ్ఎంసీని ఆదుకుంటున్నదో వేచి చూడాల్సిందే.

### జలమండలికి కావాల్సింది రూ.4వేల కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4వేల కోట్ల నిధులు కావాలని జలమండలి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. గోదావరి, కృష్ణా ఫేజ్‌లకు చేసిన రుణాలు, వార్షిక వడ్డీలకు రూ.వెయ్యి కోట్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలకు రూ.1500కోట్లు, ఔటర్ రింగు రోడ్డు ఫేజ్-2 ప్రాజెక్టు కింద చేపడుతున్న పనులకు, ఉచిత తాగునీటి పథకానికి రూ.500కోట్లు కేటాయించాలని కోరారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర అదనపు ఎలక్ట్రోలర్ అధికారి లోకేశ్, కలెక్టర్ గౌతమ్

## ఈవీఎం, వీవీ ప్యాట్ల పరిశీలన

మేడ్చల్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జరుగుతున్న ఈవీఎం, వీవీ ప్యాట్ల ఫస్ట్ లెవల్ చెకింగ్ పక్రియను శుక్రవారం రాష్ట్ర అదనపు ఎలక్టోరల్ అధికారి లోకేశ్‌కుమార్, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అధికారి నవీన్ దుద్ది వేర్వేరుగా జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌లు, బ్యాలెట్ బాక్స్‌ల పనితీరును ఈసీఐఎల్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో హరిప్రియ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న ప్రత్యేక ఎన్నికల పరిశీలకుడు నవీన్ దుద్ది

## మొబైల్ దొంగలు అరెస్టు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 9 : చేతిలోని మొబైల్ ఫోన్లను లాక్కుపోతున్న ఇద్దరు చైన్ స్నాచర్లను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్లు సతీష్, రఘురాములు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట్‌కు చెందిన తబ్రేజా ఖాన్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎస్ఆర్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో తన కారులో కూర్చొని సెల్ ఫోన్ చూస్తుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు అగంతకులు చేతిలోని సెల్ ఫోన్ లాక్కుని పారిపోయారు. వెంటనే బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నాంపల్లి దర్గా సమీపంలోని న్యూ ఆగాపురాకు చెందిన సయ్యద్ వాజిద్ (29), ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అమీర్ సొహెల్ (29) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. సాయంత్రం నిందితులను పట్టుకున్నారు. వారివద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## నేడు కూకట్‌పల్లిలో సీఎంఆర్ ఫ్యామిలీ మాల్ ప్రారంభం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9 : దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన సీఎంఆర్ సంస్థ మరో అంతర్జాతీయ ఫ్యామిలీ మాల్‌ను ప్రారంభించనున్నది. సకుటుంబ వస్త్ర ప్రపంచంగా విరాజిల్లుతున్న సీఎంఆర్ నగరంలోని కూకట్‌పల్లిలో శనివారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభించనున్నట్లు సీఎంఆర్ మాల్స్ వ్యవస్థాపకులు చందన మోహన రావు ఒక ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ నవీన్‌తో పాటు హీరోయిన్ శ్రీలీల ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన షో రూమ్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

## జీహెచ్ఎంసీలో ఎక్స్‌టెన్షన్ అధికారులపై చర్యలు షురూ..

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో పదవీ విరమణ పొంది ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్న అధికారులపై చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బల్దియాలో 46మంది అధికారులు కొనసాగుతున్నట్లు నివేదికలు ఇచ్చారు. హౌసింగ్ విభాగానికి ఓఎస్‌డీగా ఉన్న సురేశ్‌కుమార్‌పై వేటు వేశారు. ఫైనాన్స్ విభాగం అదనపు కమిషనర్ కెనడీని రెండు రోజుల్లో రిలీవ్ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఎక్స్‌టెన్షన్ అధికారులను తప్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేస్తున్నారు.

## మహిళలు అన్యాయాన్ని ఎదిరించే గొంతుక కావాలి

గిరిజన, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ మంత్రి సీతక్క




మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి సీతక్క, ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణ

మాదాపూర్, ఫిబ్రవరి 9 : మహిళలు స్వయంగా నిర్ణయాలు తీసుకోవాలంటే వారికి ఆర్థిక స్వేచ్ఛ ఎంతో అవసరమని గిరిజన, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని మహిళా సంక్షేమ కేంద్రంలో వృత్తి, నైపుణ్య రంగంలో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్ కాన్ఫెరింగ్ ఫంక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణతో కలిసి సర్టిఫికెట్స్‌ను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళలు స్వతంత్ర్యంగా జీవనోపాధిని పొంది ఆర్థికంగా ఎదగాలని, మహిళా సాధికారతతోనే మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని అన్నారు. అన్యాయం జరిగిన చోట ప్రశ్నించే గొంతుక ఉండాలన్నారు. సీఆర్ ఫౌండేషన్‌కు తన జీతంలోనుంచి రూ.లక్ష ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ పల్లా వెంకట్‌రెడ్డి, కోటివిటి ఇండియా వైస్ ప్రెసిడెంట్ విజయ్, స్వామి రామానందతీర్థ ఇనిస్టిట్యూట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సీఎస్ఎస్ఆర్ లక్ష్మి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మాజీ నేషనల్ సెక్రటరీ విజయలక్ష్మి, సీఆర్ ఫౌండేషన్ హెల్త్ సెంటర్ డైరెక్టర్ రజిని, ఎంఎస్‌కే డైరెక్టర్ కృష్ణ కుమారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఐఐసీటీని సందర్శించిన విద్యార్థులు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీని పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. శుక్రవారం సైన్స్ టూర్‌లో భాగంగా నగరంలోని పలు పాఠశాలలు, కాలేజీల విద్యార్థులు 200 మందికిపైగా పాల్గొన్నారు. విజిటింగ్‌కు వచ్చిన విద్యార్థులకు ఐఐసీటీ క్యాంపస్ పరిధిలోని కెమికల్ ల్యాబ్‌లతో పాటుగా, సెమియో కెమికల్స్, కెమికల్ ఇంజినీరింగ్, బయోగ్యాస్ ప్లాంట్, ఐఐసీటీ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాజెక్టులపై పరిశోధకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐఐసీటీ సైంటిస్టులతో విద్యార్థులకు ప్రత్యేక ఓరియెంటేషన్ సెషన్స్ నిర్వహించారు. కాగా సైన్స్ టూర్లతో విద్యార్థులకు ఈ రంగంలో ఉన్న అవకాశాలు, పరిశోధన ఫలితాలతో పాటు, ఉన్న విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన ఏర్పడుతుందని, విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ దొరుకుతుందని ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రతి ఒక్కరికీ 'సీపీఆర్'పై అవగాహన అవసరం



అత్యవసర సమయంలో నిర్వహించే 'సీపీఆర్' పై అవగాహన

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 9 : సీపీఆర్‌పై అవగాహన ఉంటే ఆంబులెన్స్ వచ్చేలోపు గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చని గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్ రెడ్డి, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆలుమ్ని భవనంలో శుక్రవారం గాంధీ వైద్య కళాశాల అలుమ్ని అసోసియేషన్, గ్లోబల్ అలయెన్స్, జనహిత స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న సీపీఆర్‌పై అవగాహన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాంధీ వైద్య కళాశాల అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్.లింగమూర్తి, డాక్టర్ రాజశేఖర్ కొల్లిపర (అమెరికా), డాక్టర్ రవీందర్ సురకంటి (అమెరికా), డాక్టర్ వేమూరి మూర్తి (అమెరికా), అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రతినిధి డెన్నిస్ మెకాలే (చికాగో), డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, అలుమ్ని అధ్యక్షుడు డాక్టర్ జీఆర్.లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఏఆర్.వెంకటరత్నం, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, సభ్యుడు డాక్టర్ సన్నీ డెవిస్, జనహిత సేవా ట్రస్ట్ సంస్థ ప్రతినిధులు, ఎన్‌సీసీ విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## రామకృష్ణమఠంలో స్వర్ణోత్సవ సంబురాలు



మఠంలో సంబురాలు జరుపుకుంటున్న భక్తులు

కవాడిగూడ, ఫిబ్రవరి 9 : దోమలగూడలోని రామకృష్ణమఠం 2023 డిసెంబర్‌లో 50 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోదమయానంద శుక్రవారం తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస, శారదాదేవి, స్వామి బోదమయానంద, మూర్తిత్రయం ఆదర్శాలతో ప్రపంచ వేదికలపై భారతీయతను చాటుతున్న మహోన్నత సేవా సంస్థ రామకృష్ణ మఠం అని అన్నారు. స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శ్రీశ్రీ చండీ హోమం, భజనలు, మ్యూజిక్ కన్సార్ట్, బహిరంగ సభ ఉంటుందన్నారు.

## నేటి నుంచి ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ మహాసభ




మహాసభ వివరాలను వెల్లడిస్తున్న సంఘం నాయకులు మోహన్‌శర్మ, మహ్మద్ షమీముల్లా, తదితరులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడేందుకు ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ మహాసభను నిర్వహిస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్‌శర్మ, ఉప ప్రధాన కార్యదర్శి మహ్మద్ షమీముల్లా తెలిపారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్‌లోని జీటీఎస్ కాలనీలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న మహాసభకు విద్యుత్ కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.



'నమస్తే తెలంగాణ, తెలంగాణ టు డే' దినపత్రికల స్టాల్‌ను ప్రారంభించిన సీజీఎం సీహెచ్ శ్రీనివాస్, సర్క్యులేషన్ జనరల్ మేనేజర్ రాంరెడ్డి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, జూలూరి గౌరీశంకర్, మామిడి హరికృష్ణ, తదితరులు

## ఓయూ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసును ముట్టడిస్తాం

ఫీజుల పెంపుపై పీహెచ్‌డీ విద్యార్థుల నిరసన



ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 9 : ఓయూలో ఫీజుల పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా పరిశోధన విద్యార్థులు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్లకార్డులతో నిరసనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశారు. వీరికి పలు విద్యార్థి సంఘాల నాయకులు, పీజీ విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ ఓయూలో ఫీజుల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని మండిపడ్డారు. అదేవిధంగా ప్రైవేటు రీ సెర్చ్ సెంటర్ల వల్ల విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే రద్దు చేయాలని, భోజనం, వసతి సౌకర్యం అందరికీ కల్పించాలని, యూజీసీ నుంచి ఏ ఇతర ఫెలోషిప్ రాని పరిశోధక విద్యార్థులకు 25వేల ఫెలోషిప్ ఇవ్వాలని కోరారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీ సెర్చ్ స్కాలర్స్ రహీం, కిరణ్, ఆంజనేయులు, స్వరాజ్, రాము, వినయ్, దశరథ్, అంజన్ బాబు, రవి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక ప్రదర్శనలో నమస్తే స్టాల్

కవాడిగూడ, ఫిబ్రవరి 9 : నగరంలోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో శుక్రవారం రాత్రి ప్రారంభించిన 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో 'నమస్తే తెలంగాణ దిన పత్రిక' సర్క్యులేషన్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నమస్తే తెలంగాణ' 'తెలంగాణ టు డే' దిన పత్రికల స్టాళ్లను దిన పత్రిక చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) సీహెచ్ శ్రీనివాస్, సర్క్యులేషన్ జనరల్ మేనేజర్ డి.రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నమస్తే తెలంగాణ, 'తెలంగాణ టు డే' దినపత్రికలతో పాటు పలు పుస్తకాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎం ఇ.వినయ్ కుమార్, ఏసీఓలు వై.మధుకర్, వెంకటేశ్, సిబ్బంది తెలుకుంటి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రవ్వా శ్రీహరి వేదికపై పలువురు ప్రముఖులు ప్రసంగించారు.



రవ్వా శ్రీహరి వేదికపై కళాకారుల నృత్యాలు





